## పెబ్బేరు మండలంలో పెరిగిన 700మంది ఓటర్లు

పెబ్బేరు, నవంబర్ 29: సవరించిన ఓటరు జాబితా ప్రకారం పెబ్బేరు మండలంలో 700మంది ఓటర్లు పెరిగారు. అంటే ఓటరు నమోదు చివరి అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈ ఓటర్లు కొత్తగా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. గతంలో విడుదల చేసిన ఓటరు జాబితాలో మండలంలో మొత్తం 40,810 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల కమిషన్ తాజాగా విడుదల చేసిన జాబితాలో వీరి సంఖ్య 41,510 మందికి చేరింది. గురువారం జరుగబోయే శాసనసభ ఎన్నికలకు సంబంధించి 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలోని పెబ్బేరు, చెలిమిల్లతోపాటు మండలంలోని 20 గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

## వైభవంగా రుద్రాభిషేకం



రుద్రహోమం నిర్వహిస్తున్న భక్తులు

కొత్తకోట, నవంబర్ 29: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో నిర్మించిన దత్తకోటిలింగేశ్వర ఆలయంలో కోటిలింగాల స్థాపన కోసం బుధవారం రుద్రహోమం నిర్వహించారు. మూడు రోజులపాటు వైభవంగా జరుగుతున్న కోటిలింగాల స్థాపన కోసం 20 శివకోటి యంత్రాలతో మొదటగా ఈ రుద్రహోమం నిర్వహిస్తున్నారు. కార్తీకమాసంలో తలపెడుతున్న రుద్రహోమాన్ని కార్తీకమాసంలో 15రోజులపాటు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, అర్చకులు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ఐ కాల్వలో యువకుడు గల్లంతు

గోపాల్‌పేట, నవంబర్ 29: కేఎల్ఐ కాల్వలో పడి యువకుడు గల్లంతైన ఘటన రేవల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై శివకుమార్ కథనం మేరకు.. రేవల్లికి చెందిన రాజు (38) బుధవారం రేవల్లి-తల్పునూరు గ్రామాల మధ్య గుండా వెళ్తున్న కేఎల్ఐ కాల్వ నీటిలో పడి కొట్టుకుపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించలేదు. రాజు తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## వైభవంగా మైసిగండి మైసమ్మ ఉత్సవాలు

కడ్తాల్, నవంబర్ 29: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కడ్తాల్ మండలంలోని మైసిగండి మైసమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం పెద్ద రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించిన తేరులో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద తేరును ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. ఆలయ పరిసరాలు మైసమ్మ తల్లి నామస్మరణతో మార్మోగాయి. తేరును లాగడానికి యువకులు, భక్తులు పోటీ పడ్డారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, ఆలయ చైర్మన్ శిరోలీపంతూనాయక్, సర్పంచ్ తులసీరాంనాయక్, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ అర్చక సిబ్బంది యాదగిరిస్వామి, బోడియనాయక్, కృష్ణ, రాములు, చంద్రయ్య, దేవేందర్, వెంకటేశ్, శ్రీనివాస్, రమాదేవి, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో తేరు లాగుతున్న భక్తులు, యువకులు

# ఓటుకు వేళాయే..

- అన్ని రకాల ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు ఎన్నికల సామగ్రి
- సెంటర్ల వద్ద 144 సెక్షన్, పటిష్ట పోలిసు బందోబస్తు

ఖిల్లాఘణపురం, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికలకు ఓటేసేందుకు సమయం ఆసన్నమైంది. మరికొద్ది గంటల్లో ప్రారంభం కానున్న పోలింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది అందులో భాగంగానే ఖిల్లాఘణపురం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు పోలీస్ బందోబస్త మధ్య ఎన్నికల సామగ్రి ఈవీఎంలు చేరుకున్నాయి. జిల్లా కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన అధికారులకు ఎన్నికల సామగ్రిని అందజేయగా వారివారి పోలింగ్ కేంద్రాలకు వివిధ వాహనాలతో తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా.. సాయంత్రం 5గంటలకు ముగుస్తుంది. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు, పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు.

### పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

గోపాల్‌పేట, నవంబర్ 29: గోపాల్‌పేట, రేవల్లి, మండలాల్లో బుధవారం పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. గోపాల్‌పేట మండలంలోని 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 132 మంది సిబ్బందిని నియమించినట్లు తాసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

మొత్తం 31, 277 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రేవల్లి మండలంలో 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, 80మంది సిబ్బందిని నియమించినట్లు తాసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు. 17, 830 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు ఆమె తెలిపారు.



జిల్లాకేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద వైద్యసిబ్బంది



పాల్కెపహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు



పాల్కెపహాడ్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది





సోలీపూర్‌లో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో చేరుకుంటున్న అధికారులు



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల సామగ్రితో వివిధ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఎస్సై శ్రీహరి

ఖిల్లాఘణపురం, నవంబర్ 29: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రచార పర్వం ముగిసింది. 48 గంటలపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై శ్రీహరి మండల ప్రజలకు సూచించారు. ఎవరూ రాజకీయ పార్టీల గుర్తులు, జెండాలు, ఫ్లకార్డులతో కనిపించకూడదని, ప్రచారం నిర్వహించకూడదని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపుగా ఉండకూడదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయొద్దని హెచ్చరించారు. 48 గంటల 144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలు వాట్సాప్, ఫేస్‌బుక్, ఆన్‌లైన్‌లో, ఎస్ఎంఎస్ రూపంలో కూడా ప్రచారం చేయకూడదని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళికి లోబడి ప్రతిఒక్కరూ నడుచుకోవాలని , రెచ్చగొట్టడం, తగాదాలు, గొడవలకు దిగితే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కేసు నమోదైతే ఎన్నికలు వచ్చిన ప్రతిసారి జీవితంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, విద్యార్థులు, యువత కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగాలు, విదేశాల్లో చదువు విషయంలో సమస్యలు వస్తాయని సూచించారు. ప్రచార సమయం ముగిసిందని ఓటరు కానివారు, స్థానికేతరులు నియోజకవర్గాలు, గ్రామాలు, వార్డులు వదిలి వెళ్లిపోవాలని, 48గంటల నిబంధనలు అమలులో ఉన్నాయని, పోలీసుల నిఘా పటిష్ఠంగా ఉందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 100, 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు అమలు చేస్తున్నామని, ప్రతిఒక్కరూ పోలీస్ సూచనలు, ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని మండల ప్రజలను కోరారు.




పటిష్ట బందోబస్త్‌లో ఎస్సై శ్రీహరి, పోలీస్ సిబ్బంది